AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
13-9-2025 (Saturday) MAIN EDITION

## అమెజాన్ ఫెస్టివల్ సేల్




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** ప్రముఖ ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ తన ప్రతిష్టాత్మకమైన ''గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్'' ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఈ భారీ షాపింగ్ ఉత్సవం సెప్టెంబర్ 23 నుంచి మొదలుకానుంది. ప్రైమ్ మెంబర్స్‌కు ప్రత్యేకంగా సెప్టెంబర్ 22 నుంచే ప్రీ యాక్సెస్ అందుబాటులో ఉంటుంది. ఈ సేల్‌లో వినియోగదారులకు ఎలక్ట్రానిక్స్, మొబైల్ ఫోన్లు, గృహోపకరణాలు, ఫ్యాషన్, ల్యాప్‌టాప్‌లపై భారీ తగ్గింపులు లభించనున్నాయి. కాగా.. ఇప్పటికే ఈ సేల్‌కు సంబంధించిన మైక్రోసైట్‌ను లైవ్‌లోకి తెచ్చింది. సెప్టెంబర్ 17న మొబైల్ ఫోన్ల ఆఫర్లను ప్రకటించనుంది.

## మధ్యప్రదేశ్ సీఎంకు తప్పిన పెను ప్రమాదం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్‌కు పెను ప్రమాదం తప్పింది. శనివారం ఉదయం మందసౌర్‌లో గాంధీ సాగర్ ఫారెస్ట్ రిట్రీట్‌లో ఆయన ప్రయాణిస్తున్న హాట్ ఎయిర్ బెలూన్ మంటల్లో చిక్కుకుంది. అయితే అదృష్టవశాత్తు మంటలు అంటుకునేలోపు ముఖ్యమంత్రి సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సీఎం మోహన్ యాదవ్ ప్రయాణిస్తుండగా, హాట్ ఎయిర్ బెలూన్ నుంచి మంటలు చెలరేగాయి.

## రేపే భారత్ – పాక్ మ్యాచ్





**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ :** ఆసియా కప్ 2025లో భాగంగా భారత్ - పాకిస్తాన్ మధ్య జరగనున్న హై వోల్టేజ్ మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. భారత కాలమానం ప్రకారం.. ఆదివారం రాత్రి 8 గంటలకు మ్యాచ్ మొదలుకానుంది. కాగా.. యూఏఈతో జరిగిన పోరులో భారత్ గెలుపొందగా, అటు పాకిస్థాన్ సైతం ఓమన్ జట్టుపై తొలి విజయాన్ని అందుకుంది. ఈ రెండు టఫ్ జట్ల మధ్య జరగనున్న పోరుపై క్రికెట్ అభిమానుల్లో ఎంతో ఉత్కంఠ నెలకొంది.

పార్టీ ఫిరాయింపుల పర్వం ఇప్పుడు రాష్ట్రంలో కొత్త చర్చకు దారితీసింది. రాజకీయంగా, నైతికంగా దిగజారి పోతున్న నేతల తీరును ఎత్తి చూపుతోంది. అభివృద్ధి కోసమని అప్పట్లో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు ఇప్పుడు మాట మార్చడం విమర్శలకు తావిచ్చింది. తాము పార్టీ మారలేదని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రిని కలిశామని చెబుతుండడం అసలు సిసలైన స్వార్థ రాజకీయాలకు ఉదాహరణగా నిలిచింది. పదవుల కోసం దిగజారిన నాయకులను చూసి జనం చీదరించుకుంటున్నారు.

-అక్షరటుడే, హైదరాబాద్

- ఫిరాయింపుల ఎమ్మెల్యేలపై జనం చీదరింపులు
- నాడు కండువాలు మార్చి.. నేడు మాట మార్చేసి..
- పదవుల కోసం నేతల స్వార్థ రాజకీయాలు



# ఇవేం పాలిట్రిక్స్..

రాష్ట్రంలో ఏం జరిగిందో, ఏం జరుగుతుందో ప్రజలంతా చూశారు. ఇప్పటికీ చూస్తూనే ఉన్నారు. పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయా శాసనసభ్యులు మీడియా ముఖంగా ప్రకటించారు. సుప్రీం కోర్టు కన్నెర్ర చేయడం, అనర్హత కత్తి వేలాడుతుండడంతో ఎమ్మెల్యేలు ఇప్పుడు స్వరం మార్చారు. పదవిని కాపాడుకునేందుకు నీతిమాలిన రీతిలో వ్యవహరిస్తున్నారు. తాము కాంగ్రెస్‌లో చేరలేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామని నిస్సిగ్గుగా లిఖితపూర్వకంగా ప్రకటించడం గమనార్హం.

### అన్ని పార్టీలు కూడా..

పార్టీ ఫిరాయింపులు దశాబ్దాల కాలం నాటి నుంచి కొనసాగుతున్నదే. అన్ని రాష్ట్రాల్లోనూ జరుగుతున్నదే. ఏ పార్టీ కూడా ఇందుకు అతీతం కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఫిరాయింపులు జరిగాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అప్పటి టీఆర్ఎస్‌కు చెందిన పదిమంది ఎమ్మెల్యేలు జంప్ అయ్యారు. అంతెందుకు, ఇప్పుడు ఫిరాయింపులపై పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ కూడా తమ హయాంలో ఎంతో మంది ఇతర పార్టీల ఎమ్మెల్యేలను గులాబీ పార్టీలో చేరుకుంది. ప్రజా తీర్పును కాలరాస్తూ శాసనసభలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ,చివరకు కమ్యూనిస్టు పార్టీల ఉనికే లేకుండా చేసింది. వేరే పార్టీ గుర్తులపై గెలిచిన వారిని మంత్రులుగా చేసిన ఘనతను కూడా దక్కించుకుంది. ఇప్పుడేమో ప్రతిపక్షంలోకి రాగానే ఫిరాయింపులకు వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు ప్రకటనలు చేస్తోంది. మరోవైపు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్న అధికార కాంగ్రెస్ గతంలో ఫిరాయింపులకు వ్యతిరేకంగా గళమెత్తింది. ఇక, బీజేపీ కూడా తక్కువేమీ తినలేదు. కొన్ని రాష్ట్రాల్లో పార్టీలు, ప్రభుత్వాల ఉనికే లేకుండా చేసేసింది. అందుకు పక్కనున్న మహారాష్ట్ర రాజకీయాలే మంచి ఉదాహరణ. స్వార్థ రాజకీయాల కోసం పాకులాడుతున్న పార్టీలు నైతిక విలువలను వదిలేశాయి. ద్వంద విధానాలను అవలంభిస్తూ నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నాయి.

### ఏం జరుగుతుందో?

పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారింది నిజం.. కండువాలు కప్పుకున్నదీ అక్షర సత్యం. తాము కాంగ్రెస్ అనుబంధంగా పని చేస్తున్నామని చెప్పుకున్నదీ వాస్తవం. అయితే, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన శాసన సభాపతి ఏం నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది. పార్టీ ఫిరాయింపులపై వచ్చిన ఫిర్యాదులపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలి. గడువు సమీపిస్తున్న తరుణంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి కట్టుబడి ఎమ్మెల్యేలపై వేటు వేస్తారా? లేక పార్టీ మారలేదని శాసనసభ్యులు ఇచ్చిన సమాధానం మేరకు నిర్ణయం తీసుకుంటారా? అన్నది త్వరలో తేలనుంది.

## జీఎస్టీ సంస్కరణలతో మేలు: ప్రధాని




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ప్రధాని నరేంద్ర మోదీ శనివారం మిజోరంలో పర్యటించారు. అయిజోల్‌లో బైరబీ సైరాంగ్ రైల్వేలైన్‌ను జాతికి అంకితం చేశారు. భారతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అయిజోల్ అనుసంధానం చేస్తూ ఈ రైల్వే లైన్ నిర్మించారు. సైరాంగ్ నుంచి ఢిల్లీ, గౌహతి, కోల్‌కతాకు మూడు కొత్త రైళ్లను ప్రధాని జెండా ఊపి ప్రారంభించారు. రూ.9వేల కోట్ల అభివృద్ధి పనులను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం మోదీ మట్లాడుతూ.. క్యాన్సర్ వంటి వ్యాధులకు మందులను చౌకగా చేయడానికి జీఎస్టీ సంస్కరణలు తీసుకొచ్చినట్లు తెలిపారు. కుటుంబాలకు జీవితాన్ని సులభతరం చేయడానికి పన్ను రేట్లు తగ్గించామన్నారు. కాంగ్రెస్ పాలనలో, మందులు, బీమా పాలసీలపై భారీగా పన్నులు వేశారన్నారు. వారి పాలనలో ఆరోగ్య సంరక్షణ ఖరీదైనవిగా ఉండేవని.. నేడు ఇవి అందరికి అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

## లొంగిపోయిన మావో నేత సుజాతక్క



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ కీలక నేత సుజాతక్క శనివారం పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆపరేషన్ కగార్ తో కకావికలం అవుతున్న మావోయిస్టులను వరుస లొంగుబాట్లు తీవ్ర కలవర పెడుతున్నాయి. మావోయిస్ట్ సెంట్రల్ కమిటీ సభ్యురాలిగా కొనసాగుతున్న సుజాతక్క పోలీసుల ఎదుట లొంగిపోవడం మావోలకు పెద్ద షాక్‌గా చెప్పవచ్చు. గద్వాలకు చెందిన సుజాతక్క అలియాస్ పోతుల కల్పన కొన్నేళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో కొనసాగుతున్నారు. ఆమె కీలక ఆపరేషన్లలో పాలు పంచుకున్నారు. సుజాతక్క 106 కేసుల్లో నిందితురాలిగా ఉండగా.. ఆమెపై రూ.కోటి రివార్డు ఉంది. కాగా ఆమెతో పాటు మరికొందరు దళ సభ్యులు సైతం శనివారం లొంగిపోయినట్లు సమాచారం.

## యూఎస్ సుంకాల మోత!




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యాను ఆపేందుకు యత్నిస్తున్న అమెరికా భారత్‌పై మరింత ఒత్తిడి పెంచేందుకు యత్నిస్తోంది. ఇప్పటికే 50 శాతం సుంకాలు విధించిన అగ్రరాజ్యం.. ఇప్పుడు మిత్ర దేశాలను పురమాయిస్తోంది. ఉక్రెయిన్ - రష్యా యుద్ధాన్ని ఆపేందుకు భారత్, చైనాలను లక్ష్యంగా చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జీ7 దేశాలను కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ తీసుకొస్తున్న ఒత్తిడికి జీ7 దేశాలు తలొగ్గినట్టు సమాచారం. భారత్, చైనాలపై సుంకాలను పెంచేందుకు జీ7 దేశాలు సూచన ప్రాయంగా అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. గ్రూప్7 (జీ7)లో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా భాగస్వాములుగా ఉన్నాయి. ఆయా దేశాల ఆర్థిక మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుకున్నారు. ఈ సమావేశంలో వారి మధ్య సుంకాల విధింపునకు సంబంధించిన చర్చ జరిగింది.

## ఐపీవోలకు అద్భుత స్పందన..

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** ఇండియన్ మార్కెట్లో ఈ వారంలో ఐపీవోకు వచ్చిన మూడు మెయిన్‌బోర్డ్ కంపెనీలకు ఇన్వెస్టర్ల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. అన్ని కంపెనీలు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యాయి. అత్యధికంగా అర్బన్ కంపెనీ దాదాపు 109 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ కావడం ఈ కంపెనీ షేర్లకు ఉన్న డిమాండ్‌ను సూచిస్తోంది. దేశీయ స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అవడానికి కంపెనీలు క్యూ కడుతున్నాయి. ఈ వారంలో మెయిన్ బోర్డ్ నుంచి అర్బన్ కంపెనీ, శ్రింగర్ హౌస్ ఆఫ్ మంగళసూత్ర, దేవ్ యాక్సిలరేటర్ కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వచ్చాయి. మూడింటి బిడ్డింగ్ బుధవారం ప్రారంభమై శుక్రవారం ముగిసింది. షేర్ల అలాట్‌మెంట్ స్టేటస్ సోమవారం రాత్రి వెల్లడయ్యే అవకాశాలున్నాయి. ఈ కంపెనీల షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో ఈనెల 17న లిస్ట్ కానున్నాయి. అన్నింటికీ విశేష స్పందన లభించింది.




## గూప్–1 అవకతవకలపై విచారణ జరపాలి: హరీశ్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్ :** గ్రూప్ 1 పరీక్షల సందర్భంగా భారీగా అవకతవకలు జరిగాయని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఒక్కో ఉద్యోగానికి మంత్రులు, అధికారులు లక్షల రూపాయలు నిరుద్యోగుల వద్ద లంచం అడిగారని, ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పభుత్వం తన తప్పును సరిదిద్దుకోకుండా మరోసారి అప్పీల్‌కి వెళ్లాలని భావించడం సిగ్గుచేటన్నారు. శనివారం సిద్దిపేటలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు ఇచ్చారని వ్యాఖ్యానించారు.



## యూరియా కోసం.. ఠాణా వద్ద బారులు

రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క యూరియా బస్తా కోసం రేయింబవళ్లు సొసైటీల దగ్గర పడిగాపులు కాస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోని బీబీపేట్ మండల కేంద్రంలోని సొసైటీ వద్ద శనివారం తెల్లవారుజాము నుంచే రైతులు బారులుతీరారు. అయితే కావాల్సినంత యూరియా రాకపోవడంతో సొసైటీ సిబ్బంది, రైతులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. రైతులను కట్టడి చేయలేక సొసైటీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారు సొసైటీ వద్దకు వచ్చి రైతులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేవలం 600 బస్తాలు మాత్రమే సొసైటీకి రావడంతో ఎవరికి యూరియా ఇవ్వాలో తెలియక పోలీస్‌స్టేషన్ ఆవరణలో కూర్చోబెట్టి టోకెన్లు ఇవ్వడం గమనార్హం. – అక్షరటుడే, కామారెడ్డి

## నేపాల్‌లో కర్ఫ్యూ ఎత్తివేత

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** జెన్ జడ్ విధ్వంసంతో అల్లకల్లోలంగా మారిన నేపాల్ సర్దుకుంటోంది. శాంతిభద్రతలు అదుపులోకి రావడంతో సైన్యం కర్ఫ్యూ ఎత్తివేసింది. శనివారం ఉదయం 5 గంటల నుంచి ఖాట్మండులో నిషేధాజ్ఞలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. సోషల్ మీడియాపై నిషేధంతో మొదలైన నిరసనలు.. అవినీతి, బంధు ప్రీతికి వ్యతిరేకంగా భారీ ఉద్యమానికి దారి తీశాయి. ఈ నేపథ్యంలో యువత, ర్థులు విధ్వంసం సృష్టించారు. ప్రధాని రాజీనామా చేసినప్పటికీ శాంతించలేదు. రంగంలోకి దిగిన సైన్యం నిరసనకారులతో చర్చలు జరిపింది. అధ్యక్షుడు ప్రభుత్వాన్ని రద్దు చేయగా, జెన్ జడ్ మద్దతున్న సుశీల కర్కి తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన తరువాత సైన్యం కర్ఫ్యూను ఉపసంహరించుకుంది. అయితే, ముందు జాగ్రత్త చర్యగా కొన్ని ప్రాంతాల్లో సైన్యం పహారా కాస్తోంది.



## ఐశ్వర్యరాయ్ ఫొటోలు తొలగించాలి..

ఒకప్పటి విశ్వసుందరి ఐశ్వర్యరాయ్ బాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానం ఏర్పరచుకుంది. 'దేవదాస్', 'జోధా అక్బర్', 'గురు', 'తాళ్' వంటి క్లాసిక్ చిత్రాల్లో తన అసాధారణ అభినయాన్ని చూపించిన ఐశ్వర్య.. ఇప్పుడు ఇంటర్నెట్‌లో తనకి సంబంధించిన అశ్లీల ఫొటోలు, వీడియోల వల్ల తీవ్ర అసౌకర్యానికి గురవుతోంది. ఈ క్రమంలో ఐశ్వర్య రాయ్ బచ్చన్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన ఫొటోలు, వీడియోలు, వాయిస్‌ను డీప్‌ఫేక్ టెక్నాలజీ ఉపయోగించి అసభ్యంగా మార్చి సోషల్ మీడియా, వెబ్‌సైట్లలో వైరల్ చేస్తున్నారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. సంబంధిత ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు, టెలికాం సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారంలకు తాత్కాలిక నిషేధం విధించింది. 72 గంటల్లోగా అనధికార డీప్‌ఫేక్ కంటెంట్‌ను తీసివేయాలని ఆదేశించింది. కోర్టు జారీ చేసిన ఈ తాత్కాలిక ఉత్తర్వులు 2026 జనవరి 15 వరకు అమలులో ఉంటాయని తెలియజేసింది.

- అక్షరటుడే, సినిమా డెస్క్

